PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :183 | పేజీలు : 8 | వెల రూ.5 | గురువారం23.07.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




- గాంధీ కుటుంబాలకు రక్తం చిందించండం అలవాటే
- అందరం కలసికట్టుగా ఉండి మోదీని గద్దె దించుదాం
- విపక్షాలకు రేవంత్ రెడ్డి పిలుపు

నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్ కు కారకుడైన ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాలపై పోలీసుల దాడిని నిరసిస్తూ, కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను ఆ పార్టీ నాయకులు అమ్ముకుని.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు.



# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి

కొడంగల్, ప్రభాత సూర్యుడు

## రాహుల్, ప్రియాంకాపై పోలీసుల దాడిని ఖండించిన రేవంత్



### నిరసన తెలిపితే దాడి చేస్తారా?

అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని అన్నారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు.

### గ్లోబరీనాపై చర్యలు తీసుకోవాలా..

2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. సిబిఎస్ఈలో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు.

# 10 ఏళ్లలో 152 పరీక్షల పేపర్లు లీక్: రాహుల్ గాంధీ

ఢిల్లీ:ప్రభాత సూర్యుడుదేశంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. చివరి నిమిషంలో ప్రశ్నపత్రాల లీకేజీ వంటి ఘటనలతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. నీట్ అవకతవకలపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాల ఆందోళనల వేళ.. రాహుల్ మీడియా సమావేశం నిర్వహించారు. గత 10 ఏళ్లలో 152 పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యాయని ఆయన ఆరోపించారు. "విద్యార్థుల విషయంలో ఏం జరుగుతోంది. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుతోంది. కానీ, ఈ ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిపై లాఠీ ఛార్జ్ చేయించింది. మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది. విద్యపై రూ.1.4 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రం చెబుతోంది. కానీ, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. దీని వల్ల 7.50కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదు. ఈ పేపర్ లీకేజీ ఘటనల్లో ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా" అని రాహుల్ విమర్శించారు. "దేశ యువతకు ఉద్యోగాలు లేవు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. మన దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారు. ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయి. కేంద్రం విధానాల వల్ల పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు. ఈ దేశ భవిష్యత్తు అన్న విషయం కేంద్రం గుర్తుంచుకోవాలి" అని మండిపడ్డారు.

**విద్యార్థుల డిమాండ్లు ఇవే..**

"విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరుకుంటోంది. ఆందోళన చేస్తోన్న యువతపై దాడి చేసిన వారికి శిక్ష



పడాలని కోరుతోంది. ఇక, ఈ వైఫల్యాలకు గానూ ప్రధాని క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల డిమాండ్లకు మేం పూర్తి మద్దతు ప్రకటించాం" అని రాహుల్ వెల్లడించారు.

**ఎన్ని దెబ్బలకైనా సిద్ధం..**

"విద్యార్థుల ఆందోళనను మేం రాజకీయాలకు వాడుకోవట్లేదు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం నా బాధ్యత. దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు కేంద్రం అవకాశం ఇవ్వట్లేదు. అందుకే విద్యార్థులకు మద్దతుగా వీధుల్లోకి వచ్చాం. నిన్న నిరసనల్లో నా పట్ల జరిగిన దానికి బాధపడటం లేదు. విద్యార్థులకు జరుగుతోన్న నష్టం విషయంలోనే బాధగా ఉంది. పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ప్రజల కోసం ఎన్ని దెబ్బలు తినేందుకైనా నేను సిద్ధం" అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు.



# శంకర్ పల్లి గురుకులంలో ముగిసిన వాయిస్ ఫర్ గర్ల్స్ కాంప్ :



రంగారెడ్డి జులై 22 ప్రభాత సూర్యుడు శంకర్ పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మరియు కళాశాల నందు వాయిస్ ఫర్ గర్ల్స్ పరిచయ్ కాంప్ 10 రోజులపాటు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో మాట్లాడగలగడం, యుక్తవయసులో వచ్చే శారీరక మార్పులు మరియు పాటించాల్సిన జాగ్రత్తలు, సోషల్ మీడియాతో జాగ్రత్తగా వ్యవహరించడం, లక్ష్యాలను చేరుకొనుటకు శ్రమించే విధానం వంటి పలు అంశాల పైన శిక్షణను తీసుకోవడం జరిగింది. లింగ సమానత్వం, విద్యార్థులు వారి హక్కులకు భంగం కలిగినప్పుడు ధైర్యంతో మాట్లాడగలగడం వంటి అంశాలను గురించి ఈ కార్యక్రమంలో నేర్చుకోవడం జరిగిందని శంకర్ పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి కృష్ణవేణి గారు తెలియజేయడం జరిగింది .ప్రిన్సిపాల్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మరియు కళాశాల శంకర్ పల్లి ఏ మొయినాబాద్ రంగారెడ్డి జిల్లా

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జ్ దారుణం.. కేంద్రాన్ని నిలదీసిన BRSV రాష్ట్ర యువ నాయకులు మొకిల్ల శ్రీకాంత్ రెడ్డి

ప్రభాత సూర్యుడు – సిద్దిపేట అర్బన్ ఢిల్లీలో తమ హక్కుల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని దీ=ాం రాష్ట్ర యువ నాయకులు మొకిల్ల శ్రీకాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే హక్కు ప్రతి విద్యార్థికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులపై బలప్రయోగానికి పాల్పడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు.



విద్యార్థుల ఆగ్రహాన్ని లాఠీలతో అణచివేయాలని ప్రయత్నించే ప్రభుత్వాలు చరిత్రలో నిలవలేదని, ప్రజాస్వామ్య ఉద్యమాలను అణిచివేసే పాలకులు ప్రజల తీర్పు నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జ్‌కు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను బలప్రయోగంతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మొకిల్ల శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన హెచ్చరించారు.

# వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక

**– జలసిరి పనులను వేగవంతం చేయాలి : మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి**

అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడు ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. మండల కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన లైన్ డిపార్ట్‌మెంట్ అధికారుల సమీక్ష సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలపై అవగాహన కల్పించారు.



గ్రామాల్లో వర్షపు నీటిని సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీవాణి సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమం కింద ఇంటికి ఇంకుడు గుంత, రైతుకు పంటకుంట, ఊరికి ఊటకుంట,
బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్లు వంటి పనులను గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో గుంతలు తవ్వి విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి, విద్యాశాఖ అధికారి, ఎంపీఓ, పంచాయతీరాజ్ ఏఈ, మిషన్ భగీరథ ఏఈలు, పశుసంవర్ధక శాఖ వైద్యులు, ఐకేపీ ఏపీఎం, ఈజీఎస్ ఏపీఓ, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# అంకమ్మ చెరువు కు పొంచి ఉన్న ముప్పు: అధికారుల కళ్లెదుటే అక్రమంగా చేపల చెరువుల నిర్మాణం!

**హైటెన్షన్ లైన్ల కిందే భారీ తవ్వకాలు.. 'వాల్టా' చట్టం గాలికి..**
**ఒకే పొలంలో 3 బోర్లు.. రెవెన్యూ, విద్యుత్ అధికారుల తీరుపై స్థానికుల తీవ్ర ఆగ్రహం.**





అశ్వారావుపేట, జూలై 22( ప్రభాత సూర్యుడు )భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రంలోని చారిత్రాత్మక అంకమ్మ చెరువు (పెద్ద చెరువు) ఉనికి ప్రమాదంలో పడింది. చెరువును సంరక్షించాల్సిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో, కొంతమంది అక్రమార్కులు యధేచ్ఛగా చెరువును ఆనుకొని మరియు పక్కనే ఉన్న అసైన్మెంట్ భూములను ఆక్రమించి, ఎటువంటి అనుమతులు లేకుండా భారీ చేపల చెరువులను తవ్వుతున్నారు. రాజ్యాంగం కల్పించిన పర్యావరణ పరిరక్షణ హక్కులను కాలరాస్తూ, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

**హైటెన్షన్ వైర్ల కింద ప్రాణ సంకట తవ్వకాలు,**

పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో క్షేత్రస్థాయి పరిశీలనలో స్పష్టమవుతోంది. దాదాపు లక్షల వోల్టుల విద్యుత్ ప్రవహించే భారీ హైటెన్షన్ విద్యుత్ టవర్లకు క్రింద చేపల చెరువు , మరియు ఆ వైర్ల కిందే జెసిబిలతో భారీగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. విద్యుత్ లైన్ల కింద ఎటువంటి శాశ్వత నిర్మాణాలు గానీ, లోతైన తవ్వకాలు గానీ జరపకూడదనే కనీస నిబంధనలను ఇక్కడ బేఖాతరు చేశారు. చేపల చెరువుల కోసం నీరు నింపినప్పుడు, విద్యుత్ ఘాతాలు సంభవించి భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ శాఖ అధికారులు గతంలో నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో పనులను నిలిపివేయించడంలో విఫలమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి.

**'వాల్టా' చట్టం ఎక్కడ అమలు,**

జల, భూమి మరియు వృక్ష సంరక్షణ చట్టం ప్రకారం, సహజ వనరులైన చెరువులు, నదులు మరియు భూగర్భ జలాలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. చెరువు భూములను (ఖీశీతీవంష్ట్రశీతీవ శ్రీఘఅంం) ఆక్రమించడం లేదా వాటి స్వభావాన్ని మార్చడం తీవ్రమైన నేరం. కానీ, ఇక్కడ అంకమ్మ చెరువు పక్కనే దాదాపు 6 మీటర్ల ఎత్తు వరకు మట్టిని పోసి , పెద్ద పెద్ద గట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మట్టిని ఎక్కడికి నుండి తరలించారు, ఈ తవ్వకాలకు అనుమతులు ఎవరు ఇచ్చారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. అనుమతులు లేకుండా ఇంత భారీ ఎత్తున పనులు జరుగుతుంటే, సంబంధిత నీటి పారుదల శాఖ , రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు.

**భూగర్భ జలాల విధ్వంసం – రెవెన్యూ శాఖ పాత్ర,**

సాధారణంగా ఒక సర్వే నెంబర్ పరిధిలోని పొలంలో బోర్లు వేయడానికి కఠినమైన నిబంధనలు ఉంటాయి. భూగర్భ జలమట్టం పడిపోకుండా చూడటానికి వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీల అనుమతి తప్పనిసరి. కానీ, ఈ అక్రమ చేపల చెరువుల కోసం ఏకంగా మూడు కొత్త బోర్లను ఏర్పాటు చేయడం విస్మయానికి గురిచేస్తోంది. రెవెన్యూ శాఖ అధికారులు ఎటువంటి పరిశీలన లేకుండా, ఒకే చోట మూడు బోర్లు వేయడానికి మరియు వాటికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి ఏ విధంగా అనుమతులు ఇచ్చారనేది పెద్ద స్కామ్‌గా కనిపిస్తోంది. అసైన్మెంట్ భూముల్లో ఎటువంటి వ్యవసాయేతర పనులు చేపట్టకూడదనే నిబంధన ఉన్నా, వాటిని చేపల చెరువులుగా మారుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**అధికారుల నిర్లక్ష్యం – అవినీతి ఆరోపణలు,**

స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా, అధికారులు కేవలం 'తూతూ మంత్రం'గా విచారణ చేసి, అక్రమార్కులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. అధికారులు మామూళ్లు తీసుకుని, కళ్లెదుటే జరుగుతున్న విధ్వంసాన్ని ఉపేక్షిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంకమ్మ చెరువు మనుగడను కాపాడటానికి, పర్యావరణాన్ని రక్షించడానికి జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. అక్రమ తవ్వకాలను నిలిపివేసి, నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోర్లను సీజ్ చేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై, మరియు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ పాలనలో ఏఐ వినియోగం పెంచాలి

**పనిని సులభతరం చేసి.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కృత్రిమ మేధస్సు కీలకం**

**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**






మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ ప్రభాత సూర్యుడు జూలై 21 ప్రభుత్వ ఉద్యోగులు తమ రోజువారీ విధుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. ఏఐ వినియోగంతో తక్కువ సమయంలో ఎక్కువ పనిని పూర్తి చేయడంతో పాటు పనిని సులభతరం చేయడం, తప్పులను తగ్గించడం, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, కలెక్టరేట్ సిబ్బందికి టి–ఫైబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్వో మాలతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏఐ శిక్షణ కార్యక్రమం ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మొదటి పారిశ్రామిక విప్లవానికి ఆవిరి యంత్రం, రెండో పారిశ్రామిక విప్లవానికి విద్యుత్, మూడో పారిశ్రామిక విప్లవానికి డిజిటలైజేషన్, కంప్యూటర్ సాంకేతికతలు ఆధారంగా నిలిచాయని, ప్రస్తుత నాలుగో పారిశ్రామిక విప్లవం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగమని వివరించారు. చాట్‌జీపీటీ వంటి ఏఐ సాధనాలు ప్రస్తుతం అన్ని రంగాల్లో విస్తృతంగా వినియోగంలోకి వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల నిర్వహణ, నోటింగ్, డ్రాఫ్టింగ్, ఫైల్ మూవ్‌మెంట్, డేటా విశ్లేషణ వంటి రోజువారీ పనులను ఏఐ సాంకేతికత మరింత సులభతరం చేస్తుందని అన్నారు. డ్రాఫ్టింగ్‌లోని వ్యాకరణ, స్పెల్లింగ్ తప్పులను సరిచేసుకోవడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లు, పాంప్లెట్లు, ఫ్లెక్సీ బ్యానర్ల రూపకల్పనలోనూ ఏఐ టూల్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఏఐ ఒక సహాయకారి మాత్రమేనని, మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఏఐ అందించే సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా అధికారులు, ఉద్యోగులు తప్పనిసరిగా ఒకసారి పరిశీలించి ధృవీకరించుకోవాలని సూచించారు. ఏఐ సాంకేతికత ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలోనే ఉందని, ప్రభుత్వ వ్యవహారాల్లో తుది నిర్ణయం ఎల్లప్పుడూ సంబంధిత అధికారి లేదా ఉద్యోగి మాత్రమే తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాలనలో ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించడం, పనిని సులభతరం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించారు. డేటా విశ్లేషణ, నివేదికల తయారీ, లేఖల ముసాయిదా, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, రోజువారీ కార్యాలయ పనుల్లో ఏఐ వినియోగంపై శిక్షకులు ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా వివరించారు. అధికారులు, సిబ్బంది తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన 'సూపర్ టీచర్' బృందంతో పాటు వాసుదేవ్,
రాజులకు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ధన్యవాదాలు
తెలిపారు.

కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ఘన నివాళులు

హైదరాబాద్ । ప్రభాత సూర్యుడు జూలై 22 తెలంగాణ విమోచన ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ఉషశ్రీ తాల్క ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 1925 జూలై 22న మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు గ్రామంలో జన్మించిన దాశరథి, తన బాల్యాన్ని మధిరలో గడిపి, ఉర్దూ, సంస్కృతం, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన మహోన్నత సాహితీవేత్త అని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా మలుచుకుని తెలంగాణ విమోచన ఉద్యమంలో అక్షరసైనికుడిగా నిలిచారని కొనియాడారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ తెలంగాణ ఆత్మను, ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహాకవి దాశరథి అని ఆమె అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, మానవతా విలువలను తన కవిత్వంలో ప్రతిబింబింపజేసి తరతరాలకు స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. దాశరథి రచించిన అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, అమృతాభిషేకం, ధ్వజమెత్తిన ప్రజ, కవితాపుష్పకం, తిమిరంతో సమరం, పునర్నవం, నేత్రపర్వం, గాలిబ్ గీతాలు, నవమి, నవమంజరి, ఖబడ్దార్ చైనా, వ్యాసపీఠం వంటి రచనలు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచాయని ఉషశ్రీ తాల్క తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రదానం చేసే దాశరథి సాహితీ పురస్కారం ఆయన సాహిత్య మహోన్నతతకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ చరిత్ర ఉన్నంతకాలం మహాకవి దాశరథి పేరు, ఆయన సాహిత్య వారసత్వం, స్వేచ్ఛా సందేశం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఉషశ్రీ తాల్క అన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలి...మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

## గోదావరి జలాలను పరిశీలించిన మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.




ఖమ్మం, జులై 22 ప్రభాత సూర్యుడు. త్రాగునీటి ని కాపాడుకుంటూ, రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కలిసి వి. వెంకటాయ పాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా రైతులు ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు వంటి తక్కువ నీటిఅవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ 2026 నుంచే అధికారులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు వరి సాగుపై పట్టుబడితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. 1977లో వచ్చిన కరువు కంటే ప్రస్తుతం వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న సూపర్ ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమై ఉండే అవకాశముందని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దీని ప్రభావం పెరిగి భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని, త్రాగునీటి పరిరక్షణపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఖమ్మం జిల్లాకు కృష్ణా జలాలు మాత్రమే సరిపోవని, దశాబ్దాలుగా గోదావరి జలాలను తీసుకురావాలనే ప్రజల ఆకాంక్ష ఉందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి శ్రీరాముడి పేరుతో 'సీతారామ' ప్రాజెక్టుగా నామకరణం చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు జిల్లాకు అందుతున్నాయని చెప్పారు. ఇంజినీర్ల సూచనల మేరకు వైరాకు తరలించిన గోదావరి నీటిని రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం జరుగుతోందన్నారు. మంచుకొండతో పాటు ఇతర ఎత్తిపోతల వ్యవస్థల ద్వారా చెరువులు నింపి, మంచుకొండ ఓవర్‌ఫ్లోను మున్నేరులోకి మళ్లించడం ద్వారా ఖమ్మం నగర త్రాగునీటి అవసరాలను తీర్చేప్రయత్నం చేస్తున్నామని వివరించారు. అవసరమైతే డీప్‌కట్ నుంచి మంచుకొండకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించే అత్యవసర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సుమారు రూ. 90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఏర్పడిందని, ఇది సాగునీటి రంగంలో విశేష విజయమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక సూచనలు అందించి విజయవంతంగా పూర్తి చేసిన ఇంజినీర్లను ప్రత్యేకంగా అభినందించారు. పశ్చిమాసియా యుద్ధాల ప్రభావంతో బొగ్గు, గ్యాస్ కొరత ఏర్పడి విద్యుత్ సరఫరా, యూరియా ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రైతులకు పారదర్శకంగా యూరియా అందించేందుకు ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఇది పూర్తిగా రైతుల సంక్షేమం కోసమేనని చెప్పారు. రాజకీయ ప్రేరేపణలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. వీబీజీఆర్ఏఎం నిధులను వినియోగించి ఎన్ఎస్‌పీ కాలువల్లో పెరిగిన పొదలను తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు మంత్రి సూచించారు. ఖమ్మం నగరంలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని, విద్యుత్ స్తంభాల సమీపంలో మొక్కలు నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత చాలా తక్కువగా ఉందని, రాబోయే నెలల్లో వర్షాలు కురవకపోతే త్రాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశముందని అన్నారు. అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ వచ్చే జూన్-2027 వరకు త్రాగునీటి అవసరాలు తీరేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటి వరకు గోదావరి జలాలను వైరాకు తరలించామని, ప్రస్తుతం రాజీవ్ కాలువ షట్టర్లను మూసివేసి గోదావరి నీటిని తిరిగి ఖమ్మం వైపు మళ్లించి పాలేరు రిజర్వాయర్ ను నింపే అవకాశాలను ఇంజినీర్లు, నిపుణులు పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ ప్రక్రియను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా త్రాగునీటి సమస్యను అధిగమించగలమనే విశ్వాసం ఉందన్నారు. అయితే వర్షాలు లేకుంటే వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు కష్టసాధ్యమవుతుందని హెచ్చరించారు. నీరు కనిపిస్తున్నదని నిర్లక్ష్యం చేయకుండా అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ. 175 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సిఇ ఇర్రిగేషన్ శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డిపిఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టి బొమ్మ దహనం

### నిట్ పేపర్ లీక్ పై నిరసన తెలిపిన కాంగ్రెస్ నాయకులు

ములుగు జులై 22 ప్రభాత సూర్యుడుములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో బుధవారం నిట్ పేపర్ లీక్ చేసి, విద్యార్థుల పై లాఠీ ఛార్జి , కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ అరెస్టు ను



ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. నరేంద్ర మోదీ నిట్ పేపర్ లీక్ కు నైతిక బాధ్యత వహించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, నరేంద్ర మోదీ దిష్టి బొమ్మ ని దహనం చేశారు. ఈసందర్బంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ నిట్ పేపర్ లీక్ చేసి, విద్యార్థుల పై లాఠీ ఛార్జ్ చేయడం ప్రజా స్వామ్య విరుద్ధం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ఉపాధ్యక్షులు దనపనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళన కు కారణం అయ్యారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు తో ముడి పడి ఉన్న కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. విద్యార్థులలో కోల్పోయిన విశ్వాసాన్ని



పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పారదర్శకంగా విచారణ జరిపి దొషులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు . ఈకార్యక్రమంలోబ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిడెం సాంబశివరావు, కాంగ్రెస్ నాయకులు మన్యం సునీల్, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్టెం సాయి, నాయకులు పీలారి శెట్టి మురళి, సీతాదేవి, పిట్ట సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు

## మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రారంభించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.

చర్ల జులై 22 ప్రభాత సూర్యుడుభద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామంలో



చర్ల పోలీసుల ఆధ్వర్యంలో నిర్మించిన నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రారంభించారు. పాఠశాలలోని విద్యార్థిని,విద్యార్థులకు స్కూల్ బ్యాగులను, పలకలను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విద్య అనేది ప్రతి చిన్నారి భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులు కూడా నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం, క్రమశిక్షణ, విద్యార్థుల నైతిక విలువలు, హాజరు శాతం పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించాలని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, యోగా, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, వీటి ద్వారా ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెంపొందుతాయని చెప్పారు. అనారోగ్యం, ప్రమాదాలు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు మూఢనమ్మకాలను నమ్మకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని తెలిపారు. ఆరోగ్య సమస్యలకు వైద్య చికిత్సే సరైన మార్గమని వివరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచనలు చేశారు. డెంగీ, మలేరియా వంటి వర్షాకాల వ్యాధుల లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలకు అవసరమైన టీకాలు పూర్తిగా వేయించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచనలు చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, ఎస్పి 2 ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ, యంఈఓ రమణ, కాంట్రాక్టర్ సంతోష్, సర్పంచ్ లక్ష్మి, ఉపాధ్యాయురాలు సౌజన్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు

### నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

### రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య

ములుగు జులై 22 (ప్రభాత సూర్యుడు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దలు పైడకుల అశోకన్న వారి సూచనల మేరకు,మంగపేట మండలంలోని పలు సంక్షేమ వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య , డీపీవో వెంకటయ్య కలిసి సందర్శించారు. మంగపేట మండలంలోని చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి, గ్రామాలలో బాలికల హాస్టల్ విద్యాలయాన్ని ఆయన మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయితీ అధికారి కొండా వెంకయ్య, సంబంధిత అధికారులు, స్థానిక చుంచుపల్లి



మాజీ ఎంపిటిసి బొచ్చు వెంకన్నతో కలిసి అక్కడ పాఠశాలు హాస్టల్ లలో తనిఖీ నిర్వహించి అందుకు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ఆయన బ్రేక్‌ఫాస్ట్ చేశారు. సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసి, పరిసరాల పరిశుభ్రతను, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ, హాస్టల్ వార్డెన్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి అని విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి అని వార్డెన్లు నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి వార్డెన్లను ఆదేశించారు. భోజన నాణ్యత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తదితర అధికారులు పాల్గొన్నారు.




## బద్ది పోచమ్మకు బోనాలు సమర్పించుకున్న ఆరె కటిక కుల బాంధవ్యులు

ప్రభాత సూర్యుడువేములవాడ :



వేములవాడ పట్టణ ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ బోనాల సందర్భంగా పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ,మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోయల్కార్ మస్తాన్ ముఖ్య అతిథిగా ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సుల తో ప్రజలందరూ సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో ఆరె కటిక సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్క భక్తులు పోచమ్మ తల్లి మొుక్కు తీర్చుకోవడానికి గొర్రెలను ,మేకలనుఅమ్ముకుంటూవారిజీవనంకొనసాగిస్తున్నారు ,పోచమ్మ తల్లి గుడి ఉంటేనే వారికి జీవితం ఉన్నది అని చెప్పడం విశేషం.





# ఘట్టమనేని వారసుడి కోసం మహేష్ రంగంలోకి దిగుతారా?

ఆ యాంగిల్ లో చూస్తే జయకృష్ణకు శ్రీనివాస మంగాపురం సాధారణ తొలి సినిమా కాదు. ఘట్టమనేని ఫ్యామిలీకి చెందిన కొత్త తరం హీరోగా ఆయన ఎలా నిలబడతారనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. టాలీవుడ్ లో స్టార్ కుటుంబాల నుంచి కొత్త హీరోలు పరిచయం కావడం కొత్త విషయం కాదు.



అయితే ప్రతి తరం మారుతున్న కొద్దీ, ఆడియన్స్ అంచనాలు వారసులపై ఉండే ప్రెజర్ కూడా పెరుగుతూనే ఉంది. ఇప్పుడు శ్రీనివాస మంగాపురం సినిమాతో ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వడం ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. మరోవైపు బాలీవుడ్ నటి రవీనా టండన్ కుమార్తె రషా తదానీ కూడా ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానుండటంతో, ఇది ఇద్దరు స్టార్ కిడ్స్‌కు కీలకమైన తొలి అడుగుగా మారింది. టాలీవుడ్ హిస్టరీని పరిశీలిస్తే చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, మహేష్ బాబు, జూ. ఎన్టీఆర్, రామ్ చరణ్, అఖిల్ లాంటి స్టార్ వారసులు తమ తొలి సినిమాల సమయంలోనే భారీ అంచనాలను ఎదుర్కొన్నారు. కొందరికి డెబ్యూ సినిమానే మంచి సక్సెస్ ను అందించగా, మరికొందరు తరువాతి సినిమాలతో తమ స్థానాన్నిబలపరుచుకున్నారు. కానీ ప్రతి సందర్భంలోనూ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపించింది. ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఆడియన్స్ లో మొదట్లో ఇంట్రెస్ట్ ను పెంచగలదు కానీ, లాంగ్ రన్ సక్సెస్ ను డిసైడ్ చేసేది మాత్రం యాక్టింగ్, స్టోరీ సెలెక్షన్ మరియు ఆడియన్స్ ఆదరణే. ఆ యాంగిల్ లో చూస్తే జయకృష్ణకు శ్రీనివాస మంగాపురం సాధారణ తొలి సినిమా కాదు. ఘట్టమనేని ఫ్యామిలీకి చెందిన కొత్త తరం హీరోగా ఆయన ఎలా నిలబడతారనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. అదే సమయంలో రషా తదానీకి కూడా తెలుగు మార్కెట్‌లో తొలి ముద్ర వేయాల్సిన బాధ్యత ఉంది. అందువల్ల ఈ సినిమా ఇద్దరి కెరీర్‌లకు కీలక పరీక్షగా మారింది. ఇలాంటి నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్ కూడా ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యంగా ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి వస్తున్న హీరో కావడంతో సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రమోషనల్ ఈవెంట్‌లో పాల్గొనే అవకాశం ఉందనే డిస్కషన్ ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. దానికి తగ్గట్టే రీసెంట్ గా డైరెక్టర్ అజయ్ భూపతి కూడా ఈ మూవీ ప్రమోషన్స్ లో మహేష్ పాల్గొనే అవకాశాలున్నాయని హింట్ ఇచ్చారు.

# విప్లవ పథం: నక్సలైట్ పాత్రల్లో మెప్పించిన టాప్-5 కథానాయికలు

ప్రజా యుద్ధనౌక, విప్లవ చిత్రాల పితామహుడు ఆర్. నారాయణమూర్తి దర్శకత్వం వహించిన ఎర్రసైన్యం చిత్రంలో యాంకర్ ఉదయభాను నక్సలైట్ గా అద్భుతంగా నటించి మెప్పించారు.తెలుగు చిత్రసీమలో నాయిక ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఎప్పుడూ ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా.. సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా తుపాకీ చేతబట్టి విప్లవ పోరాటాలు చేసే నక్సలైట్ పాత్రల్లో నటించి మెప్పించడం ప్రతి నటికి ఒక గొప్ప సవాలు.



విప్లవ భావజాలాన్ని, భావోద్వేగాలను పండించి నక్సల్స్ పాత్రల్లో అలరించిన కథానాయికల వైపు దర్శకులు, ప్రేక్షకులు ఎప్పుడూ ఆసక్తి చూపుతూనే ఉన్నారు. ఈ తరహా పాత్రల్లో మెప్పించిన మేటి నటిగా లేడీ సూపర్ స్టార్ విజయశాంతి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. 'ఒసేయ్ రాములమ్మ' చిత్రంలో ఈ సీనియర్ నటి పోషించిన రాములమ్మ పాత్ర తెలుగు సినిమా చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. దొరల అన్యాయాలకు వ్యతిరేకంగా అడవి బాట పట్టి నక్సలైట్‌గా మారిన పాత్రలో విజయశాంతి చూపించిన రౌద్రం.. పవర్‌ఫుల్ నటన ప్రేక్షకులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అలాగే సహజనటి జయసుధ కూడా గతంలో 'మహా సంగ్రామం' వంటి చిత్రాలలో నక్సలైట్ తరహా పాత్రను అత్యంత హుందాతనంతో భావోద్వేగాలను పండించి తన నటనా ప్రతిభను నిరూపించుకున్నారు.ఇక ప్రస్తుత తరం హీరోయిన్లలో సాయి పల్లవి 'విరాటపర్వం' సినిమాలో 'వెన్నెల'గా నక్సలైట్ కథాంశంలో జీవించారు. కామ్రేడ్ రవన్న భావజాలానికి ఆకర్షితురాలై... ప్రేమ కోసం అడవి బాట పట్టిన అమాయకపు పల్లెటూరి అమ్మాయిగా సాయి పల్లవి కనబరిచిన నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇటీవలే విడుదలైన 'మాఇంటి బంగారం' చిత్రంలో సమంత కూడా నక్సలైట్ నేపథ్య డైనమిక్ పాత్రలో సరికొత్త కోణాన్ని ఆవిష్కరించారు. అలాగే రష్మిక మందన్న 'మైసా' చిత్రంలో కట్టుబొట్టు మార్చి రౌద్ర రూపంతో కూడిన విప్లవాత్మక పాత్రను పోషించడం ఈ ట్రెండ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. కేవలం అగ్ర కథానాయికలే కాకుండా.. టాలీవుడ్‌లో వచ్చిన పలు పరిమిత బడ్జెట్.. కంటెంట్ బేస్డ్ సినిమాల్లో కూడా నటీమణులు నక్సలైట్ పాత్రల్లో అద్భుతంగా రాణించారు. అప్పట్లో ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన 'ఎర్రసైన్యం', 'ఎన్‌కౌంటర్' వంటి చిత్రాల్లో విప్లవ నాయకిలుగా నటించిన నటీమణులు పల్లెటూరి ప్రజల ఆక్రందనలకు చలించి విప్లవ పోరాటాల బాట పట్టే ప్రజా యోధులుగా నటించారు. అటు బాలీవుడ్‌లో 'హజారోన్ ఖ్వాయిషేన్ ఐసీ' చిత్రంలో చిత్రంగద సింగ్... కోలీవుడ్‌లో ప్రకాష్ రాజ్ దర్శకత్వం వహించిన 'కంజీవరమ్' లో.. పలు తమిళ రాజకీయ–విప్లవ సినిమాల్లో సౌత్ కథానాయికలు నక్సల్స్ గానో.. తిరుగుబాటుదారుల పాత్రల్లోనో నటించి మెప్పించారు. ప్రజా యుద్ధనౌక, విప్లవ చిత్రాల పితామహుడు ఆర్. నారాయణమూర్తి దర్శకత్వం వహించిన ఎర్రసైన్యం చిత్రంలో యాంకర్ ఉదయభాను నక్సలైట్ గా అద్భుతంగా నటించి మెప్పించారు. ఆయన తెరకెక్కించిన చీమలదండు, దళం, ఒకే ఒక్కడు, లాల్ సలామ్ వంటి చిత్రాలలో నక్సలైట్లుగా .. విప్లవ పోరాట నాయికలుగా నటీమణులు అత్యంత సహజమైన అభినయంతో మెప్పించారు. రొటీన్ కమర్షియల్ హంగులకు దూరంగా... పచ్చటి అడవుల నేపథ్యంలో తుపాకీ చేతబట్టి... సమాజంలోని దౌర్జన్యాలు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడే పాత్రల్లో కథానాయికలు కనిపించారు. ముఖ్యంగా పల్లెటూరి మహిళల ఆక్రందనలను, దొరల దోపిడీకి వ్యతిరేకంగా వీరనారీలుగా మారే క్రమాన్ని ఆర్. నారాయణమూర్తి తెరకెక్కించిన తీరు ఆ పాత్రల్లో నటించిన నటీమణులకు ప్రత్యేకమైన గుర్తింపును అందించడమే కాకుండా... వారి నటనా జీవితాల్లో మర్చిపోలేని విప్లవాత్మక పాత్రలుగా సినిమా హిస్టరీలో నిలిచిపోయాయి. మొత్తానికి సాధారణ ప్రేమకథలు, కమర్షియల్ హంగుల కంటే కూడా నక్సలైట్ పాత్రలు నటీమణుల లోని అసలైన నటనా కోణాన్ని బయటకు తీస్తాయని ప్రూవైంది.

# పెట్టుబడుల్లో చందమామ సేఫ్ గేమ్!

కాజల్ నటిగా బిజీగా ఉన్న సమయంలోనూ ఎంతో క్రమశిక్షణతో మెలిగేవారు. వృత్తి పరమైన జీవితాన్ని నిర్మించుకోవడంలోనూ కాజల్ నూరుశాతం సక్సెస్ అయ్యారు. పరిశ్రమలో దశాబ్దాలుగా అగ్రకథానాయకురాలిగా రాణిస్తున్న కాజల్ అగర్వాల్ తెర వెనుక ఆర్థిక ప్రణాళికల విషయంలో ఎంతో ఆచరణాత్మకంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా సెలబ్రిటీలు విభిన్న రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపుతుంటారు. అయితే కాజల్ మాత్రం స్టార్టప్ పెట్టుబడుల కంటే సురక్షితమైన రియల్ ఎస్టేట్ రంగాన్నే తొలి ప్రాధాన్యతగా ఎంచుకుంటున్నట్లు వెల్లడించారు. తన గత అనుభవాల నేపథ్యంలోనే కాజల్ ఈ నిర్ణయానికి వచ్చారు. గతంలో తాను చేసిన కొన్ని స్టార్టప్ పెట్టుబడులు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని ఎలాంటి లాభాలను అందించలేదన్నారు. వ్యాపార ప్రపంచంలో సరికొత్త ప్రయోగాలు, అంచనాలు కొన్నిసార్లు తలకిందులవుతాయని వ్యక్తిగత అనుభవంతో కాజల్ గ్రహించారు. ఈ వైఫల్యాలే ఆమెను మరింత జాగ్రత్తగా అడుగులు వేసేలా చేశాయి. భారీ లాభాల ఆశతో కూడిన హై-రిస్క్ పెట్టుబడుల పట్ల అమ్మడు స్పష్టమైన వైఖరిని ప్రదర్శించారు. స్వతంత్రంగా స్వయంగా వ్యాపార నిర్ణయాలు తీసుకునేంత ఆత్మవిశ్వాసం, అనుభవం ప్రస్తుతానికి తనకు లేవని నిజాయితీగా అంగీకరించారు. వ్యాపార మెలకువలు పూర్తిగా అవగతం కానప్పుడు ఇతరులపై ఆధారపడి పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టడం శ్రేయస్కరం కాదన్నారు. ఈ కారణాల వల్లే తన సంపాదనను అత్యంత రిస్క్‌తో కూడిన మార్గాల్లో కాకుండా కాల పరీక్షకు నిలిచిన రియల్ ఎస్టేట్ రంగంలో మళ్లించడానికి ప్రాధాన్యమిస్తున్నారు. భూములు, స్థిరాస్తుల కొనుగోలు దీర్ఘకాలికంగా నష్టాలను నివారించడమే కాకుండా స్థిరమైన వృద్ధిని ఇస్తాయనే నమ్మకం కాజల్ లో బలంగా ఉంది. ఇది ప్రముఖులలోనే కాకుండా సాధారణ పెట్టుబడిదారులకు కూడా ఆచరణీయమైన మార్గంగా నిలుస్తోంది. కష్టపడి సంపాదించిన డబ్బును సురక్షిత మార్గాల్లో మళ్లించడంలో సెలబ్రిటీలు కూడా ఎంతో సంయమనం



పాటించాల్సిన అవసరం ఉందని కాజల్ ఉదంతం నిరూపిస్తోంది. ప్రముఖ నటిగా గ్లామర్ ప్రపంచంలో కొనసాగుతూనే ఆర్థిక భద్రత విషయానికి వచ్చేసరికి వాస్తవిక దృక్పథంతో వ్యవహరించడం విశేషం. అతి సాహసాలు చేసి నష్టపోవడం కంటే నిలకడైన ప్రణాళికే మేలని కాజల్ నిరూపిస్తున్నారు. ఈ తరహా ఆర్థిక నిర్ణయాలు సినిమా రంగానికే పరిమితం కాకుండా అందరికీ వర్తిస్తాయి. రిస్క్ ..సేఫ్టీ మధ్య సరైన సంతులనం సాధించడం ద్వారానే భవిష్యత్తును భద్రపరుచుకోవచ్చని కాజల్ నిరూపిస్తుంది. కాజల్ నటిగా బిజీగా ఉన్న సమయంలోనూ ఎంతో క్రమశిక్షణతో మెలిగేవారు. వృత్తి పరమైన జీవితాన్ని నిర్మించుకోవడంలోనూ కాజల్ నూరుశాతం సక్సెస్ అయ్యారు. తెలుగు పరిశ్రమలో తనకంటూ కొన్ని పేజీలు రాసుకున్నారు. 'మగధీర' లాంటి సినిమాలో మిత్రవింద పాత్రలో నటించి ఎంతో మంది నటీమణులకు రోల్ మోడల్ గతా నిలచారు. కాజల్ తర్వాత తరం నటులంతా మిత్రవింద లాంటి పాత్ర ఒక్క సినిమాలో పోషించినా? జీవితానికి చాలు అనుకున్న నటీమణులు ఎంతో మంది ఉన్నారు. అప్పట్లో కాజల్ క్రేజ్ చూసి ఇండస్ట్రీకి వచ్చిన తెలుగు అమ్మాయిలు ఎంతో మంది ఉన్నారు. వారికి అవకాశాలు వచ్చాయా? లేదా? అన్నది పక్కన బెడితే? కాజల్ అగర్వాల్ ప్రభావం తెలుగు అమ్మాయిల్లో ఆ రేంజ్ లో ఉండేది

# అల వైకుంఠపురములో' జోడీ మళ్ళీ రిపీట్..? లోకేష్ లాక్ చేశాడా?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా ఇప్పుడు సెన్సేషనల్ లైనప్ తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇండియన్ సినిమా దగ్గర మోస్ట్ బిజీగా ఉన్న పాన్ ఇండియా హీరోస్ లో ఐకాన్ స్టార్ ఒకరిగా నిలవగా ఈ లైనప్ లో దర్శకుడు లోకేష్ కనగరాజ్ తో ప్లాన్ చేస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ కూడా ఒకటి. అనౌన్సమెంట్ తోనే మంచి హైప్ ని జెనరేట్ చేసిన ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.అయితే లేటెస్ట్ గా ఈ సినిమా హీరోయిన్ గా స్టార్ బ్యూటీ పూజా హెగ్డే లాక్ అయినట్టుగా కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే నిజం అయితే మాత్రం 'అల వైకుంఠపురములో' జోడీ రిపీట్ అయినట్టే అని చెప్పాలి. ఆల్రెడీ వీరికి ఇండస్ట్రీ హిట్ ట్రాక్ రికార్డు ఉంది. లోకేష్ కూడా పూజా హెగ్డేతో 'కూలీ'లో మంచి ట్రీట్ ఇచ్చాడు. సో ఈ ముగ్గురు కలయికలో ప్రాజెక్ట్ అంటే మరింత ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ఇక దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది.

# దుల్కర్ 'ఐయామ్ గేమ్' ఫస్ట్ బెట్ కి డేట్ ఫిక్స్!

మలయాళ యంగ్ టాలెంటెడ్ హీరో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు మిస్కిన్ తెరకెక్కిస్తున్న అవైటెడ్ థ్రిల్లర్ చిత్రాల్లో గ్యాంబ్లింగ్ నేపథ్యంలో వస్తున్న చిత్రం 'ఐయామ్ గేమ్' కూడా ఒకటి. డీసెంట్ బజ్ ఉన్న ఈ సినిమాని మేకర్స్ ఇంట్రెస్టింగ్ కంటెంట్ తో ప్రెజెంట్ చేస్తూ వస్తున్నారు.ఇలా మేకర్స్ సినిమా తాలూకా ఫస్ట్ గ్లింప్స్ పై ఇంట్రెస్టింగ్ అప్డేట్ అందించారు. దుల్కర్ ఫస్ట్ బెత అంటూ ఈ జూలై 28 డేట్ ని లాక్ చేశారు. దుల్కర్ పై పార్టీ మోడ్ లో డిజైన్ చేసిన ఈ




పోస్టర్ ఫ్యాన్స్ కి మంచి కిక్ ఇస్తుంది. ఇక ఈ రానున్న గ్లింప్స్ లేదా టీజర్ తో సినిమాపై కొంచెం క్లారిటీ ఆడియెన్స్ కి రావచ్చు.ఇక ఈ చిత్రంలో దుల్కర్ సరసన కయాదు లోహర్, సంయుక్త ఫీమేల్ లీడ్ లో నటిస్తుండగా కాతిర్, శాండీ మాస్టర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అలాగే జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని దుల్కర్ నిర్మాణం వహించాడు. పాన్ ఇండియా లెవెల్లో ఈ చిత్రం ఈ ఆగస్ట్ 20న గ్రాండ్ గా విడుదల కాబోతుంది.

# రామాయణం రేంజ్ మామూలుగా లేదుగా.. గ్లోబల్ లెవెల్లో గ్రాండ్ ప్లానింగ్!

రీసెంట్ గా ఈవెంట్ కు సంబంధించిన విజువల్ వీడియోను రిలీజ్ చేయగా ఆది వైరల్ అవుతోంది. పురాణాల్లో ఎంతో ప్రత్యేకమైన రామాయణాన్ని ఇప్పుడు సరికొత్తగా స్క్రీన్ మీదకు తీసుకువస్తున్నారు. కేవలం ఇండియా వరకే పరిమితం చేయకుండా వరల్డ్ వైడ్ ఆడియన్స్ కు రీచ్ అయ్యేలా మేకర్స్ గట్టిగానే ప్లాన్ చేస్తున్నారు. రీసెంట్ గా ఢిల్లీలో ప్రథమ్ సంకల్ప్ పేరుతో ఒక గ్రాండ్ ఈవెంట్ చేసి ఈ సినిమా ప్రమోషన్ జర్నీని అఫీషియల్ గా స్టార్ట్ చేశారు.



ఈ వేడుక చూస్తుంటే ఇండియన్ సినిమా రేంజ్ ఇంకో లెవెల్ కు వెళ్లడం ఖాయం అనిపిస్తోంది. రీసెంట్ గా ఈవెంట్ కు సంబంధించిన విజువల్ వీడియోను రిలీజ్ చేయగా ఆది వైరల్ అవుతోంది. దంగల్ దర్శకుడు నితీష్ తివారీ ఈ సినిమా కోసం సెట్ చేసిన యాక్టర్ల లైనప్ చూస్తే ఎవరికైనా మతిపోవాల్సిందే. రాముడిగా రణబీర్ కపూర్, సీతగా మన సాయి పల్లవి నటిస్తుంటే.. మోస్ట్ పవర్ ఫుల్ రావణుడి రోల్ లో కేజీఎఫ్ స్టార్ యష్ దిగుతున్నాడు. ఇక ఆంజనేయ స్వామిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే లాంటి స్టార్స్ తో సెట్ అంతా నిండిపోయింది. ఈ ప్రథమ్ సంకల్ప్ ఈవెంట్ కు వచ్చిన వీళ్లంతా తమ రోల్స్ మీద ఉన్న రెస్పెక్ట్ ను చాలా ఎమోషనల్ గా షేర్ చేసుకున్నారు. ముఖ్యంగా సాయి పల్లవి ఈ క్యారెక్టర్ గురించి చెప్పిన మాటలు ఫ్యాన్స్ కు బాగా కనెక్ట్ అయ్యాయి. సీతమ్మ క్యారెక్టర్ చేయడం అనేది తాను ప్లాన్ చేసుకోలేదని, అదొక వరంగా ఫీల్ అవుతున్నానని చెప్పింది. ఆ పవిత్రమైన క్యారెక్టర్ కు న్యాయం చేయడానికి రోజూ మెడిటేషన్ చేసేదాన్నని, మైండ్ ను ప్రశాంతంగా ఉంచుకునేదాన్నని తన అనుభవాలను పంచుకుంది. దేవుళ్ల పాత్రలు దొరకడం నిజంగా అదృష్టమే అంటూ ఆమె ఎమోషనల్ అయింది. డైరెక్టర్ నితీష్ తివారీ కూడా తన యాక్టర్ల మీద పూర్తి నమ్మకంతో ఉన్నాడు. రణబీర్ కళ్లలో రాముడు, సాయి పల్లవి కళ్లలో సీతమ్మ కనిపించారని ఆయన చెప్పిన తీరు ఇంట్రెస్టింగ్ గా ఉంది. వాళ్ల కళ్లలో ఉన్న నిజాయితీ చూసే కాస్టింగ్ ఫిక్స్ చేశానని చెప్పడం విశేషం. కేవలం స్టార్ డమ్ చూసి కాకుండా, క్యారెక్టర్ కు ఎవరు యాప్ట్ అవుతారో వాళ్లనే తీసుకున్నట్లు డైరెక్టర్ క్లారిటీ ఇచ్చాడు.టెక్నికల్ గా కూడా ఈ సినిమా హాలీవుడ్ కు ఏమాత్రం తీసిపోని రేంజ్ లో రెడీ అవుతోంది. ఆస్కార్ విన్నర్స్ హన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ లాంటి వాళ్లు మ్యూజిక్ ఇస్తుండగా.. ప్రైమ్ ఫోకస్, డీఎన్ఈజీ లాంటి వరల్డ్ క్లాస్ స్టూడియోలు వీఎఫ్ఎక్స్ వర్క్ చూసుకుంటున్నాయి. నిర్మాత నమిత్ మల్హోత్రా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్ తో ఐమ్యాక్స్ క్వాలిటీలో దీన్ని తెరకెక్కిస్తున్నారు. జులై 24న గ్లోబల్ లెవెల్లో ట్రైలర్ రిలీజ్ కాబోతోంది. ఇక పార్ట్ 1 ను 2026 దీపావళికి, పార్ట్ 2 ను 2027 దీపావళికి రిలీజ్ చేస్తామని పక్కాగా అనౌన్స్ చేశారు. పౌరాణిక నేపథ్యం ఉన్న సబ్జెక్టులను తెరపైకి తీసుకురావడం అంటే మామూలు సాహసం కాదనే చెప్పాలి. ఏ చిన్న లాజిక్ మిస్ అయినా ఆడియన్స్ నుంచి ట్రోల్స్ తప్పవు. అందుకే ఈ జనరేషన్ కు నచ్చేలా అదిరిపోయే విజువల్స్ ఇస్తూనే, ట్రెడిషనల్ ఎమోషన్స్ మిస్ కాకుండా మేకర్స్ చాలా బ్యాలెన్స్ గా అడుగులు వేస్తున్నారు. ఫస్ట్ ఈవెంట్ తోనే ఎక్స్పెక్టేషన్స్ పెంచేసిన రామాయణం టీమ్.. త్వరలో రాబోయే ట్రైలర్ తో ఇంకెంత మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555